క్లుప్తంగా

కొల్లిపర ఆలయంలో హోమాలు



కొల్లిపర: మండల కేంద్రంలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవీ సమేత జనార్ధనస్వామి ఆలయం సమీపంలోని గరుత్మంతుడి స్తంభాన్ని ఇటీవల లారీ ఢీకొనడంతో పగిలిపోయింది. ఈ నేపథ్యాన్ని పురస్కరించుకుని గ్రామ పెద్దలు గురువారం పండితులు చేత వాస్తు తదితర హోమ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలంటూ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు జగన్నాధాచార్యులు, కుమార స్వామి, ప్రసాద్, పోగుల రామలింగేశ్వర శర్మ, నిరంజన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టి

ఎంపీడీవో అత్తోట దీప్తి



తెనాలిటౌన్: రూరల్ మండలం ఎరుకలపూడి గ్రామంలో ఆధునీకరిస్తున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని గురువారం ఎంపీడీవో అత్తోట దీప్తి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో చెత్త నుండి సంపద సృష్టి కేంద్రం ఉండేదని, షెడ్లు పాడవడం వలన తయారీ కేంద్రాన్ని ఆధునీకరించి వానపాముల ఎరువులను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గౌతమ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కొల్లిపర: గత కొన్ని రోజులుగా మండల పరిధిలో ఎక్కడో ఒకచోట దొంగతనాలు జరుగుతున్నాయని, కావున గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పి.కోటేశ్వరరావు సూచించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అనుమానస్పద స్థితిలో ఎవరైనా కనిపించినా, శుభ కార్యాలకు, ఇతర పనుల నిమిత్తం కుటుంబంలో సభ్యులందరూ ఇతర పట్టణాలకు వెళ్లే సమయంలో ఇతర ప్రదేశాలకు వెళ్లే సమయంలో ఇంట్లో విలువైన వస్తువులు ఉంటే వాటిని వారి వెంట తీసుకువెళ్లాలని, బ్యాంకు లాకర్‌లో భద్రపరచుకుని పోవాలని కోరారు. వారి ఇంటికి తగిన భద్రతలను చేసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందిస్తే అటువంటి గృహాలకు పోలీస్ సిబ్బందిని కేటాయించి రాత్రి సమయంలో ఆ ఏరియా పరిశీలించడం జరుగుతుందన్నారు. వీలైనంతలో గృహాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రజలు ముందుకు రావాలని సూచించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్

తెనాలిటౌన్: దేశ వ్యాప్తంగా కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం జులై 9న జరిగే జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిరంకుశ విధానాలను నిరసిస్తూ అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జులై 9న ఢిల్లీలో జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సూచించారు. ప్రతి యూనియన్ జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించి యాజమాన్యాలకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. యాజమాన్యాల దయాదక్షిణ్యాలపై కార్మిక సమాజం కాలం వెల్లదిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందరూ కలిసికట్టుగా ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని వెల్లడించారు. కార్యక్రమంలో కె.రవి కుమార్, కె.నాగేశ్వరరావు, వర్ధన్, జోనేష్, శ్రీనివాసరావు, ఆంజనేయులు, ఎం.సాంబ శివ రావు, బి.ప్రసాద్, మరియమ్మ, రాధ, వై.ఈశ్వరి, షేక్ హుస్సేన్‌వలీ పాల్గొన్నారు.

పాఠశాలలో టీడీపీ సమావేశం



బాపట్ల: పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలను రాజకీయలకు దూరంగా ఉంచాలనే నిబంధనలను సైతం తెలుగుదేశం పార్టీ బాపట్ల నాయకులు విస్మరించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు గొలపల్లి శ్రీనివాసరావు ఏకంగా ప్యాడిసన్‌పేట ప్రాథమిక పాఠశాలలో టీడీపీ వార్డు సమావేశం నిర్వహించారు. పార్టీ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. పార్టీ స్థానిక నాయకులు అందరితో జరిగిన ఈ సమావేశం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించటం బాపట్లలో చర్చనీయాంశమైంది.

శానిటేషన్ నిర్వహణ మరింత మెరుగుపడాలి

మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక



మురుగు కాల్వల పరిశుభ్రతను పరిశీలిస్తున్న చైర్మన్ రాధిక

తెనాలిటౌన్: పట్టణంలో శానిటేషన్ నిర్వహణను మరింత మెరుగుపరచాలని అధికారులను మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. గురువారం పట్టణ 30వ వార్డులో నిర్వహిస్తున్న శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్‌ను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. కాల్వల్లో పేరుకుపోయిన చెత్త చెదారం, వార్డులో శానిటేషన్ పనులను పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. తడి చెత్త, పొడి చెత్త నిర్వహణను సమగ్రంగా అమలు చేయాలని, ప్రజలు రోడ్లపై చెత్త చెదారం వేయకుండా చూడాలని సూచించారు. కాల్వల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయడం వలన మురుగు నీరు సక్రమంగా పారుదలకాక వ్యర్థాలు పేరుకుపోతున్నాయని చెప్పారు. ప్రజలు విజ్ఞప్తితో ఆలోచించి వ్యర్థాలు కాల్వల్లో పడవేయవద్దని తెలియజేశారు. ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతి మాట్లాడుతూ ప్రతిరోజు పట్టణంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నడుస్తున్నట్లు తెలిపారు. కాల్వల్లో చెత్త చెదారం తొలగించడం, పరిసరాల పరిశుభ్రత, రోడ్ల వెంబడి మొక్కలు తొలగించడం వంటివి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్లానింగ్ అధికారి సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజ నిర్మాణం కావాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డాక్టర్ సి.హెచ్‌వి.సుబ్బారావు

తెనాలిటౌన్: పొగాకు రహిత సమాజ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ సి.హెచ్.వి.సుబ్బారావు పిలుపునిచ్చారు. రూరల్ మండలం కొలకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ముఖ్యఅతిథిగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సి.హెచ్.సుబ్బారావు పాల్గొని పొగాకు, వాటి ఉత్పత్తులు సేవించడం వలన కలిగే అనార్థలను వివరించారు. నోటీ క్యాన్సర్, ఊపిరితిత్తుల సమస్యలు, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు వస్తాయని తెలిపారు. పొగాకు, మత్తు పదార్థాల బారిన పడిన వ్యక్తులు వీటిని విడనాడలాని సూచించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పై సూచనలు తెలియజేసి పొగాకు సంబంధిత ఉత్పత్తులు వాడేవారిని మానిపించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మాచర్ల నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఎం.అన్నారావు, మేకల సుబ్బారావు, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళా సద్వినియోగం చేసుకోవాలి

తెనాలిటౌన్: ఈ నెల 28వ తేదీన స్థానిక చిన రావూరు ఐటీఐ కళాశాలలో నిర్వహించే జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.చినవెంకటేశ్వర్లు సూచించారు. 28వ తేదీ శనివారం ఉదయం 9.30 గంటల నుండి జాబ్‌మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లామా, ఫార్మసీ, పీజీ చదువుకున్నటువంటి 18 నుంచి 35 సంవత్సరాలు వయస్సు గల విద్యార్థినీ విద్యార్థులు జాబ్ మేళాకు హాజరయ్యే ఉద్యోగాలు సాధించాలని కోరారు. బయోడేటాతో పాటు ఎడ్యుకేషన్ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

యువతకు సీఐ రమేష్‌బాబు పిలుపు



ర్యాలీలో సీఐ రమేష్‌బాబు, విద్యార్థినులు

తెనాలిరూరల్: యువత సరైన మార్గంలో పయనించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా తెనాలి జీఎంజీ కళాశాల, చెంచుపేట కేఎస్‌ఎం హైస్కూలు విద్యార్థినులతో మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై తెనాలిలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేటి యువత డ్రగ్స్, గంజాయి వంటి వ్యసనాలకు బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన చాలామంది యువకులు తప్పుదోవ పడుతున్నారని, ఇలాంటి పొరపాట్లను విద్యార్థులు చేయకూడదని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణకు తీవ్రంగా కృషి చేస్తుందని తెలిపారు. యువత జీవితాలు బాగుపడాలంటే చెడు వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని ఆయన కోరారు. డ్రగ్స్ బారి నుండి యువతను రక్షించి, వారిని సరైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత సమాజంపై ఉంది. కార్యక్రమంలో త్రీ టౌన్ ఎస్ఐలు ప్రకాశరావు, కరిముల్లా, జీఎంజీ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ శాంత, వైస్‌ప్రిన్సిపల్ సిస్టర్ రోజ్‌లిన్, పాటిబండ్ల హేమలత, దాసరి విజయలక్ష్మి, ఎస్తేరు రాణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై తహసీల్దార్ విచారణ



తెనాలిటౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలపై వచ్చిన అర్జీలపై మండల తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ గురువారం విచారణ చేపట్టారు. రూరల్ గ్రామం నందివెలుగులో పర్యటించి అర్జీదారుల సమస్యలను తెలుసుకుని, సమస్యలపై విచారించారు. ప్రజా సమస్యలను పరిష్కరించే దశగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. ఆయన వెంట వీఆర్వో, వీఆర్‌ఏలు, సిబ్బంది ఉన్నారు.

ఆషాఢ మాసంలో ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు



ఎస్‌ఎస్‌పీ జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ

రేపల్లె: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆషాడ మాసంలో ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ చెప్పారు. చెరుకుపల్లి మండలం గూడవల్లి గౌడపాలెంలోని రామాలయంలో గురువారం నిర్వహించిన ధార్మిక సమితి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆషాఢ మాసం ఎంతో విశిష్టమైందని చెప్పారు. ఈ మాసంలో చాతుర్మాస్య దీక్ష ప్రారంభమవుతుందన్నారు. ఈ మాసంలో వచ్చే గురు పౌర్ణమి రోజున గ్రామగ్రామాన ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి ఆడపడుచు గోరింటాకు పెట్టుకునే విధంగా ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామ దేవతలకు పసుపు కుంకుమ సారె సమర్పణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు జంజనం హేమ శంకరరావు, పడమట వెంకటేశ్వరరావు, రాయన్న నాగబాబు, కేసన్న నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు నిర్మించిన ప్రహరీ ప్రారంభం



అమర్తలూరు(వేమూరు): పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం పూర్తిగా ఉండాలని ఎంపీపీ రాపర్ల నరేంద్ర అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు నిర్మించిన ప్రహరీ గోడను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982- 83 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.2.30 లక్షలతో ఆట స్థలం, అసంపూర్తిగా ఉన్న ప్రహరీ గోడ నిర్మించడం జరిగిందన్నారు. పూర్వ విద్యార్థి శివకుమార్ రూ.1.25 లక్షలతో మీటింగ్ హాల్‌లో విద్యుత్ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కనపర్తి నిరీక్షణరావు, మాజీ ఎంపీపీ మైనేని రత్నప్రసాద్, తహసీల్దారు నెహ్రుబాబు, ఎంపీడీవో మారుతీ శేషమాంబ, కనపాల రమేష్, విద్యా కమిటీ చైర్మన్ వినయ్‌బాబు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి పని చేయాలి

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్



మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్

రేపల్లె: గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతమయ్యేలా పని చేయాలని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ కోరారు. గుళ్ళపల్లిలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ కన్వీనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ స్థాయి కమిటీల నియామకాలను పూర్తి చేయాలన్నారు. సమర్థవంతమైన నాయకులను కమిటీలో ఎన్నుకోవాలన్నారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపునిచ్చేలా కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ అసమర్థతతను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలా పని చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచినా మేనిఫెస్టోను అమలు చేయకపోగా ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. ప్రశ్నించే వారిపై కేసులు పెడుతూ వేధింపులకు గురి చేస్తున్నారని చెప్పారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇవ్వాలన్నారు. నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించారు. సమావేశంలో రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల కన్వీనర్లు మేడికొండ అనిల్, ఇంకొల్లు రామకృష్ణ, యార్లగడ్డ వెంకట రాంబాబు, దుండి వెంకటరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

కౌలు రైతులకు కౌలు కార్డులు అందజేయాలి

వేమూరు: కౌలు రైతులకు కార్డులు త్వరగా అందజేయాలని ఏవో ప్రేమ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో వీఆర్వోలు, గ్రామ వ్యవ సాయ సహాయకులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు కార్డులు వల్ల ప్రభుత్వం పథకాలు పొందడం జరుగుతుందన్నారు. ధాన్యం కొనుగోలుకు ఉపయోగపడుతుందన్నారు. కౌలు రైతులు ప్రతి ఒక్కరూ కౌలు కార్డులు పొందాలని ఆయన సూచించారు.

అంగన్‌వాడీ, ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సీడీపీవో సుచిత్ర



రేపల్లె: రేపల్లె ఐసీడీఎస్ సెక్టారు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ, ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు లభించినట్లు సీడీపీవో ఎం.సుచిత్ర తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. రేపల్లె సెక్టారు పరిధిలో ఒక అంగన్‌వాడీ, 5 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పట్టణంలోని 5వ వార్డు ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ సెంటరులో అంగన్‌వాడీ టీచర్ పోస్టుకై ఓపెన్ కేటగిరీలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 10వ వార్డు శౌంతివారివీధి అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టుకు ఓసీ కేటగిరి, జేఎల్‌బీ కాలేజీ రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాకు ఓపెన్ కేటగిరి, పిరాట్లంక 1 అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాకు ఓపెన్ కేటగిరి, నగరం మండలం పెద్దవరం అంగన్‌వాడీ కేంద్రంలో ఎస్సీ కేటగిరి, సిరిపూడి 1 అంగన్‌వాడీ కేంద్రంలో బీసీ–బీ కేటగిరి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తకు దరఖాస్తు చేసుకునేవారు 10వ తరగతి, ఆయాకు దరఖాస్తుకు చేసుకునే వారు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థి గ్రామ పరిధిలో నివాసం కలిగి ఉండి, వివాహిత మహిళై ఉండాలన్నారు. వయసు 2025 జులై 1వ తేదీ నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలని చెప్పారు. ఈ నెల 27వ తేదీ నుంచి జులై 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు రేపల్లెలోని ప్రాజెక్ట్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు అంగన్‌వాడీ కేంద్రంలో సంప్రదించాలన్నారు.

విశిష్ట పురస్కార్ అవార్డు అందుకున్న పోలీస్‌రావు



కలెక్టర్ వెంకట మురళి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న పోలీస్‌రావు

కర్లపాలెం: రెడ్‌క్రాస్ సొసైటీ కర్లపాలెం మండల అధ్యక్షుడు ఇనకొల్లు పోలీస్‌రావు జిల్లా కలెక్టర్ వెంకటమురళి చేతుల మీదుగా విశిష్ట పురస్కార్ అవార్డును అందుకున్నారు. పలు రంగాలలో విశిష్ట సేవా కార్యక్రమాలు నిర్వహించిన వారికి గురువా రం బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విశిష్ట పురస్కార్ అవార్డులను కలెక్టర్ వెంకటమురళి అందజేశారు. కర్లపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ రెడ్‌క్రాస్ సొసైటీ కర్లపాలెం మండల అధ్యక్షుడిగా చేసిన పలు సేవలకు గుర్తింపుగా తనకు విశిష్ట పురస్కార్ అవార్డును కలెక్టర్ అందజేశారని పోలీస్‌రావు తెలిపారు.

వారాహి నవరాత్రి ఉత్సవాలు ఆరంభం



వారాహి అవతారంలో అమ్మవారు

తెనాలి: పట్టణ మారీస్‌పేటలోని శ్రీజగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థానం పీఠ పాలిత శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారికి గురువారం వారాహి అవతారంలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. వారాహిదేవి హిందూ దేవతలలో ఒకరుగా, శక్తి అవతారంగా పూజలు అందుకుంటోందని ఆలయ కమిటీ అధ్యక్షుడు గ్రంధి సేతు మాధవరావు ఈ సందర్భంగా చెప్పారు. వరాహ ముఖంతో, ఎనిమిది చేతులతో, పాశం, శూలం, నాగలి వంటి ఆయుధాలతో చిత్రీకరిస్తారనీ, లలితాదేవి సైన్యాధ్యక్షురాలు అని కూడా నమ్ముతారనీ, వారాహి అమ్మవారిని రాత్రిపూట పూజించడం సాధారణమని చెప్పారు. నవరాత్రి ఉత్సవాల్లో యావన్మంది భక్తులు శ్రీవారాహి అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పొన్నూరు నాగసూర్య శశిధరరావు, వరద వెంకట శేషగిరిరావు, తాడిపర్తి హరి, అంకమరాజు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు నాగఫణి శర్మ శర్మ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణ చేశారు.

ప్రధాన రహదారి వెంబడి జంగిల్ తొలగించాలి

ఎంపీడీవో అత్తోట దీప్తి ఆదేశం



కఠెవరం వంతెన ప్రక్కన వ్యర్థాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో దీప్తి

తెనాలిటౌన్: రూరల్ మండలం కఠెవరం–నందివెలుగు ప్రధాన రహదారి వెంబడి జంగిల్‌ను తొలగించాలని ఎంపీడీవో అత్తోట దీప్తి అధికారులను ఆదేశించారు. గురువారం కఠెవరం వంతెన వద్ద నుండి నందివెలుగు వరకు నాలుగు లైన్ల ప్రధాన రహదారి వెంబడి ఉన్న జంగిల్‌ను ఆమె పరిశీలించారు. కఠెవరం వంతెన వద్ద కొబ్బరి బొండాలు, వ్యర్థాలు గుట్టలుగా పడవేయటాని గుర్తించి తొలగించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. సోమసుందరపాలెం వద్ద నుండి రోడ్డు వెంబడి దట్టంగా పెరిగిన చెట్లు తొలగించాలని ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదు మేరకు రోడ్డు వెంబడి జంగిల్‌ను తొలగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కఠెవరం పంచాయతీ కార్యదర్శి గౌస్ మొహిద్దీన్, సోమసుందరపాలెం పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

సమ్మెలో పంచాయతీ కార్మికులు పాల్గొనాలి



సమ్మె నోటీసు ఇస్తున్న కార్మికులు

కొల్లిపర: జూలై 9వ తేదీన జరిగే దేశ వ్యాపిత సమ్మెలో పంచాయతీ కార్మికులు పాల్గొంటారని తెలియజేస్తూ కొల్లిపర పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ఎ.లీలా కుమారికి శనివారం గ్రామ పంచాయతీ ఉద్యోగుల కార్మికుల సంఘం సీఐటీయూ అనుబంధం సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ తెచ్చిందని తెలిపారు. దీనివలన కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు సమ్మె చేసే హక్కును కోల్పోతారని పేర్కొన్నారు. కనీస వేతనం 26000 ఇవ్వాలని స్కీముల్లో పనిచేసే వారిని కార్మికులుగా గుర్తించాలని కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ జూలై 9న జరిగే దేశ వ్యాపిత సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గోదాసుందర రావు మల్లోల రమేష్ పుత్తూరు ఏసు పాదం కొల్లిపర కోటేశ్వరరావు గోదా ఏసు పాదం పాల్గొన్నారు.

కలసికట్టుగా అభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎలీషాబాబు

పిట్టలవానిపాలెం (కర్లపాలెం): అధికారులు, ప్రజా ప్రతినిధులు కలసికట్టుగా అభివృద్ధి సాధించాలని పిట్టలవానిపాలెం ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎ.ఎలీషా బాబు చెప్పారు. మండల పరిషత్ వైస్ ఎంపీపీ దొంతిరెడ్డి సింధు అధ్యక్షతన గురువారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలు ప్రజా ప్రతినిధులు పర్యవేక్షించాలని చెప్పారు. తమ గ్రామంలో తాగునీరు సక్రమంగా రావటం లేదని పంచాయతీ అధికారులకు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని అల్లూరు ఎంపీటీసీ వాలి కృష్ణ కుమారి తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్‌లలో జరిగే కార్యక్రమాల గురించి తమకు తెలియజేయటం లేదని చల్లాపల్లి విజయరాజు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీటీసీలు షేక్ బాజీ, కత్తి కుమారి, గంగయ్య, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, పీఆర్‌ఏఈ రఘు, ఎంఈవో రాజారత్నం తదితరులు హాజరయ్యారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు అవసరం

ఆర్డీవో రామలక్ష్మి



రేపల్లె: పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం అవసరమని ఆర్డీవో నేలపు రామలక్ష్మి చెప్పారు. పర్యావరణ పరిరక్షణ కోసం పట్టణ ఆదర్శ వేదిక అవగాహన కార్యక్రమాలు చేపట్టటం అభినందనీయమన్నారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పట్టణ ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికలను ఆమె గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. కేవలం చైతన్య కార్యక్రమాలకే పరిమితమవకుండా మొక్కలను నాటి వాటి పెంపకం బాధ్యతలు చేపట్టాలని ఆదర్శ వేదిక సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఆదర్శ వేదిక సభ్యులు యడ్లపల్లి కిషోర్‌బాబు, డీవీ మోహనరావు, జీ సాంబశివరావు, కొడాలి ఆనందరావు, ఎం.నాంచారయ్య, ఎస్.సాయికృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన సదస్సు



మోపర్రు జెడ్పీ హైస్కూల్లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

అమర్తలూరు(వేమూరు): దోమల ద్వారా వ్యాపించే వివిధ రకాల వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని తెనాలి పట్టణం మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ అన్నారు. అమర్తలూరు మండలం మోపర్రు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మలేరియా నివారణ మాసోత్సవ అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు పుట్టకుండా.. కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. 2027 నాటికి మలేరియా కేసులను జీరోకు తీసుకొని రావడం జరుగుతుందన్నారు. ఎక్కడ నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి నిల్వలు ఉంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. హెచ్‌ఎం వాకా నాంచారయ్య, మోపర్రు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.